www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...   తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 22 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-155 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## లొంగిపోయిన మావోయిస్ట్ సావిత్రి

భర్త చనిపోవడంతో జనజీవన స్రవంతిలోకి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** మావోయిస్టులకు భారీ షాక్ తగిలింది. మావోయిస్టు సావిత్రి పోలీసుల ఎదుట లొంగిపోయింది. ఆమె మావోయిస్టు దండకారణ్య కమిటీ సెక్రెటరీ రామన్న భార్య. 2019లో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో రామన్న గుండెపోటు కారణంగా మృతి చెందాడు. రామన్నపై గతంలో పోలీసులు రూ.40లక్షల రివార్డును ప్రకటించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో మోస్ట్ వాంటెడ్‌గా రామన్న ఉన్నాడు. 1994లో దళ సభ్యురాలు సావిత్రిని రామన్న పెళ్లి చేసుకున్నాడు. సావిత్రి కుమారుడు రంజిత్ గతేడాది పోలీసులకు లొంగిపోయాడు. 2019లో గుండెపోటుతో ఛత్తీస్ ఘడ్ అడవుల్లో ఆయన చనిపోయారు. రామన్న మరణించిన కొంత కాలానికే.. ఆయన కుమారుడు శ్రీకాంత్ పోలీసులకు సరెండర్ అయ్యారు. తాజాగా కిష్టారం మావోయిస్టు ఏరియా కమిటీకి సెక్రెటరీగా వ్యవహరిస్తున్న రామన్న భార్య సావిత్రి కూడా పోలీసులకు లొంగిపోవడం గమనార్హం.

## దసరా సెలవుల్లో మార్పు లేదు

26 నుంచి అక్టోబర్ 9 వరకు సెలవులు

ప్రకటన విడుదల చేసిన విద్యాశాఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** దసరా సెలవుల్లో ఎలాంటి మార్పులు లేవని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇంతకు ముందు ప్రకటించిన ప్రకారమే దసరా సెలవులు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు దసరా సెలవులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సెలవుల కుదింపుపై పుకార్ల నేపథ్యంలో విద్యాశాఖ వివరణ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు ఇస్తామన్న దసరా సెలవుల్ని కుదించినట్లు మీడియా వర్గాల్లో పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

3లో

## క్యాన్సర్‌తో ఉన్న గర్భిణికి చికిత్స

తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారన్న వైద్యులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** మూడో దశ రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్న గర్భిణికి మెడికవర్ వైద్యులు అరుదైన చికిత్స చేసి తల్లీ బిడ్డను రక్షించారు. సోమాలియాకు చెందిన ఫదుమో మొహమ్మద్ ఒమర్ (33) 12 వారాల గర్భవతిగా ఉన్న సమయంలో స్టేజ్ -3 బ్రెస్ట్ కేన్సర్ అని వైద్యులు గుర్తించారు. ఆమె గర్భవతి కావడంతో కీమోథెరపీతో ప్రమాదం ఉంటుందని సందేహించారు. మెడికవర్ ఆస్పత్రి మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ సాద్విక్ రఘురాంను ఇటీవల సంప్రదించారు. ఆమెకు ధైర్యం చెప్పి కీమోథెరపీ చికిత్స ప్రారంభించారు. ఆమెతో పాటు, కడుపులోని బిడ్డ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ సాద్విక్ రఘురాం తెలిపారు.

## ఇంజెక్షన్ హత్యకేసులో పురోగతి

వివాహేతర సంబంధంతోనే హత్యకు భార్య ప్లాన్

నలురురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


**ఖమ్మం, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఖమ్మం బైక్ లిఫ్ట్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే జమాల్ సాహెబ్ హత్యకు కారణమని తేల్చారు. ప్రధాన నిందితులైన జమాల్ సాహెబ్ భార్య ఇమామ్‌బీ సహా మోహన్‌రావు, వెంకటేశ్, వెంకట్‌లను పోలీసులు

3లో

## నాడు వైఎస్ఆర్‌తో.... నేడు అమిత్‌షాతో కోమటిరెడ్డి మిలాకత్

**పోతిరెడ్డిపాడు నుంచి మొదలై కోల్డ్‌ఫిల్డ్ తవ్వకం లాంటి బడా కాంట్రాక్టుల రూపంలో వేల కోట్ల దోపిడి**

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రైతాంగానికి తూట్లు పొడిచిన వారిలో భాగస్వాములు కోమటిరెడ్డి బ్రదర్స్
- 2004 తరువాత నుండి ప్రాజెక్టుల కాంట్రాక్టులు, కమీషన్‌లు
- ప్రజల సొమ్ము దోచి వేల కోట్లకు అధిపతులుగా కోమటిరెడ్డి బ్రదర్స్
- ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే స్వలాభం కోసం ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కుట్రను పసిగట్టిన ప్రజలు
- మరోమారు మోసపోమంటున్న మునుగోడు ప్రజలు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి డిపాజిట్ రాకుండా అడ్డుకుంటామని వెల్లడి




పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కెరలేదు. అలాంటి ప్రాజెక్టుకు కాంట్రాక్టర్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కంపనీకి నాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పగించారు. 2006 సంవత్సరంలో 11500 క్యూసెక్యూల నుంచి 44000 క్యూసెక్యూల సామర్ధ్యంకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పెంచేందుకు ప్రణాళికలు చేశారు. పలు కాల్వల నిర్మాణం కాంట్రాక్టులు కోమటిరెడ్డి బ్రదర్స్ కంపనీలే చేపట్టాయి. నాటి నుంచి నేటి వరకు కాంట్రాక్టుల రూపంలో కోట్ల రూపాయలను దోచుకోవడం వీరి పనిగా మారింది.



అమిత్‌షాతో మిలాకత్ అయిన తరువాత జార్ఖండ్ రాష్టంలో చంద్రగుప్త ఓసీపీ అభివృద్ధి, నిర్వహణ కోసం బిడ్డింగ్. అదానీ ఎంటర్‌ప్రైజెస్, మాంట్‌కార్లో సంస్థలు పాల్గొన్నా సుషీ ఇన్‌ఫ్రా లిమిటెడ్‌కు టెండర్ దక్కింది. హజీరాబాగ్ జిల్లాలోని నార్త్ కరన్‌పురా కోల్డ్‌పిల్డ్‌లో కాంట్రాక్టు సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ తవ్వకం, డెలవరీ కోసం 25 సం. లీజు. ఈ కాంట్రాక్టు విలువ 22 వేల కోట్లు కోమటిరెడ్డి రాజగోపాల్‌కు కేంద్రం అప్పగించింది

# పోతిరెడ్డిపాడు నుంచి కోల్డ్ ఫిల్డ్ కాంట్రాక్టు వరకు

# కోట్లు కూడబెట్టి

**డబ్బు ఎరగా చూపి ఓట్లను కొనడమే రాజగోపాల్‌రెడ్డి పొలిటికల్ స్టైల్**

2004కు ముందు కోమటిరెడ్డి బ్రదర్స్ బీడి బిచ్చం.. కల్లు ఉద్దరగాళ్లే నటా !

**నల్లగొండ, సెప్టెంబర్ 21 (సమ సమాజం):**

పోతిరెడ్డిపాడు నుంచి కోల్డ్‌ఫిల్డ్ కాంట్రాక్టు వరకు అన్ని భారీ ప్రాజెక్టులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కంపణీ టెండర్ల ద్వారా పనులను చేపడుతుంది. అయితే ఆ టెండర్లు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాలతో మిలాకత్ అయ్యి నిట్టనిలువున ప్రజల సొమ్మును దోపిడి చేయటంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మించిన రాజకీయ ఉద్దండుడు మరొకరు ఉండరోమే బహుశా !. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వైఎస్ఆర్ జలయజ్ఞంలో భాగంగా రాయలసీమకు 7.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పోతిరెడ్డి పాడు ప్రాజెక్టును నిర్మించారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కెరలేదు. అలాంటి ప్రాజెక్టుకు కాంట్రాక్టర్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కంపణీ పనులను చేపట్టింది. 2006 సంవత్సరంలో 11500 క్యూసెక్యూల నుంచి 44000 క్యూసెక్యూల సామర్ధ్యంకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పెంచేందుకు నాటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రణాళికలు చేశారు. దాని ద్వారా పలు కాల్వల నిర్మాణం కాంట్రాక్టులు కోమటిరెడ్డి బ్రదర్స్ కంపణీలే చేపట్టాయి. ఆ సమయంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రి క్యాబినేట్‌లో వెంకట్‌రెడ్డి ఇన్‌ఫర్‌మేషన్ అండ్ టెక్నాలజీ మంత్రి, పోతిరెడ్డి పాడు కాంట్రాక్టు డబ్బులతో రాజగోపాల్‌రెడ్డి ఎం.పీగా పోటి చేసేందుకు సిద్ధమైయ్యారు. నాడు డబ్బును ఎరగా వేసి ఎం.పీగా గెలిచారు. తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుందని తెలిసీకూడా తెలంగాణ రైతాంగాన్ని ఖూనీ చేసేందుకు పూనుకున్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటకు అన్యాయం జరుగుతున్నా కూడా కోమటిరెడ్డి బ్రదర్స్ కాంట్రాక్టులే ప్రాధాన్యంగా భావించారు. గల కారణం నాడు వారికి కావల్సింది డబ్బు మాత్రమే. ప్రజలేసిన ఓట్లతో పదవులు సంపాదించి ఆ పదవులతో కాంట్రాక్టులను దక్కించుకొని కోట్లు కూడగట్టుకోవడం వీరి పనిగా తెగబడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలిచ్చిన వివిధ హోదాలో అనేక పదవులను అనుభవించి పరపతి మీద లాబింగులు, కమీషన్‌ల రూపంలో ప్రభుత్వ రంగ సంస్థలలో టెండర్‌లు దక్కించుకొని కోట్లు కూడబెట్టుకుంటున్నారు. కాంగ్రెస్‌తో విభేదించి బీజేపీ తీర్ధం పుచ్చుకున్న తరువాత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసలు రంగు బయట పడింది. అమిత్‌షాతో భేటిలో ఒప్పందం ప్రకారం కోల్డ్‌ఫిల్డ్ తవ్వకం, డెలవరీ కోసం లీజు అగ్రిమెంట్‌తో తన కంపణీకి సుదీర్ఘ రాబడి, బిజినెస్‌కు ఎలాంటి డోకా ఉండదని భావించి 25 సం. కాంట్రాక్టు, 22 వేల కోట్ల విలువ చేసే లీజును రాజగోపాల్‌రెడ్డి కంపణీ దక్కించుకుంది. ఇదంతా గమనించిన మునుగోడు ప్రజలు రాజగోపాల్‌రెడ్డి అమ్ముడు పోయాడని, తన వ్యక్తిగత స్వార్ధం కోసమే పార్టీ మారాడని విశ్వసిస్తున్నారు. ఇంతటితో మునుగోడుకు రాజగోపాల్‌రెడ్డి అనుబంధం ముగిసినట్లే అని చెప్పుకుంటున్నారు. తనకు ఓట్లు వేస్తే మరోమారు మోసపోతామని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఓట్లు వేయకూడదని భావిస్తున్నారు.

## దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం

పేదలకు పెన్షన్ అర్హతకార్డులు అందచేసిన తలసాని




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్?లో లబ్దిదారులకు పింఛన్ అర్హత కార్డులను ఆయన అందజేశారు. గోషామహల్ నియోజకవర్గంలో మొత్తం 9వేల పింఛన్లు ఇస్తున్నామని.. కొత్తగా 3300మందికి నూతన పింఛన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో 200 పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి అలసి పోయేవారని.. కానీ కేసీఆర్ వచ్చాక ఆ తిప్పలు తప్పాయని తలసాని తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్ లో పింఛన్ కోసం అప్లై చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు సంతోషంగా పండుగా జరుపుకోవాలనే

3లో

## యాదాద్రిలో వైభవంగా లక్షపుష్పార్చన



**యాదాద్రి, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** యాదాద్రి శ్రీ లక్ష్మీనృసింహుడి సన్నిధిలో ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్షపుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. విశేష పూజాపర్వాలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అర్చక బృందం, వేదపండితులు స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించారు. పాంచ రాత్రాగమశాస్త్ర ప్రకారం సుమారు గంటకుపైగా లక్షపుష్పార్చన పూజ పర్వాలు కొనసాగాయి. విశేష వేడుకలను యాదాద్రి అర్చక బృందం నిర్వహించగా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ ఏ బాధ్యత అపపగించినా నిర్వర్తిస్తా



రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యం

రాహుల్ జోడో యాత్రలో పాల్గొన్న సచిన్ పైలట్

**తిరువనంతపురం, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాత్ పోటీ చేస్తారనే వార్తల నడుమ తదుపరి రాజస్థాన్ సీఎం ఎవరనే అంశంపై వాడివేడి చర్చలు జరుగుతున్నాయి. గెహ్లాత్ స్థానంలో కాంగ్రెస్ నేత, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ సీఎం పగ్గాలు చేపడతారనే ఊహాగానాలు సాగుతున్నాయి. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో పాల్గొనేందుకు కేరళ వచ్చిన సచిన్ పైలట్ ఈ అంశంపై పెదవివిప్పారు. పార్టీ తనకు ఏ బాధ్యత అప్పగించినా తాను నిర్వర్తిస్తానని చెప్పారు. అశోక్ గెహ్లాత్ సీనియర్ నేతని, ఆయన దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్నారని, వచ్చే ఏడాది రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందడమే తమ ముందున్న లక్ష్యమని పైలట్ స్పష్టం చేశారు. తదుపరి రాజస్థాన్ సీఎం ఎవరని ప్రశ్నించగా కాంగ్రెస్ నాయకత్వం తమకు ఏ బాధ్యతలను నిర్ణయించినా దాన్ని ఆమోదిస్తామని పైలట్ పేర్కొన్నారు. కాగా పార్టీ అధినేత్రి సోనియా గాంధీతో ఇటీవల అశోక్ గెహ్లాత్ సమావేశం కావడంతో కాంగ్రెస్ అధ్యక్ష రేసులో గెహ్లాత్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అక్టోబర్ 17న జరిగే అధ్యక్ష ఎన్నిక కోసం గెహ్లాత్ ఇంకా నామినేసన్ దాఖలు చేయలేదు. ఇక గెహ్లాత్ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపడితే సీఎం పదవి కోసం ఎప్పటి నుంచో ఆయనతో పోటీ పడుతున్న సచిన్ పైలట్‌క్ కీలక పదవి దక్కనుంది.



## నేటినుంచి బతుకమ్మ చీరెల పంపిణీ

కోటి చీరెలు పంపిణీకి రంగం సిద్ధం

ప్రకటించిన మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ఆడ పడుచులకు ప్రభుత్వం చీరెలను సారెగా అందిస్తోంది. ఈ నెల 25 నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. నేటినుంచి రాష్ట్రవ్యాప్తంగా

3లో

## నాయకత్వ లోపమే కాంగ్రెస్‌కు అసలు సమస్య

ఎవరిని జోడించలేని రాహుల్ యాత్ర

మునుగోడులో ఎగిరేది గులాబి జెండాయే

మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి




**సూర్యాపేట, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీలో ఏ ఇద్దరిని జోడించలేని రాహుల్ గాంధీ జోడో యాత్ర చేపట్టడం విడ్డూరంగా ఉందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీ

3లో

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేం

వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన మంత్రి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** భారత స్వాతంత్యోద్యమం, తెలంగాణ రైతాంగ పోరాటం, తెలంగాణ రాష్ట్రసాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా అరణ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ తొలితరం పోరాటయోధుడని, ఆఖరి శ్వాస వరకు తెలంగాణకై పొరాడిన కొండా లక్షణ్ బాపూజీ స్మరించుకోవడమంటే తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసుకోవడమేనని అన్నారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత గొప్ప నాయకులను, గొప్ప వ్యక్తులను వారి త్యాగాలను స్మరించుకోవాలని, వారి జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా మారుమూల గ్రామంలో జన్మించి, పీడిత ప్రజల విముక్తి కోసం బహుముఖ పోరాటం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి తరం యువతకు ఆదర్శమన్నారు.

## సంపాదకీయం

# ధాన్యం సేకరణపై కొరవడిన స్పష్టత

నిత్యం పొలాల్లో కష్టపడుతూ..నానా యాతనపడుతున్న రైతుల్లో నైరాశ్యం నెలకొంటే దేశానికే ప్రమాదం. పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయం భారంగా మారుతోంది. పంటలు పండించిన రైతులను ఆదుకునేందుకు కేవలం పంటలను మద్దతు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని ఏటా ఆందోళనలు చేస్తున్నా, రోడ్డెక్కుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. తమ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలకు దిగడం పరిపాటే అన్న ధోరణిలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి. గతంలో ఎర్రజొన్న ,పసుపు రైతుల ఆందోళనలు చూశాం. తరవాత కంది రైతులు ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఇటీవల పసుపు, మిర్చి,పత్తి రైతుల ఆందోళనలు చేపట్టారు. ఇది ఒక్క తెలుగు రాష్ట్రాల పరిస్థితి మాత్రమే కాదు..దేశ వ్యాప్తంగా పంటల కొనుగోళ్లకరు సంబంధించి స్పష్టమైన విధానం లేకపోవడంతో కలుగుతున్న నష్టం. అలాగే పంటలు పండుతున్నా ప్రజలకు మార్కెట్లో సక్రమమైనదరలకు తిండిగింజలు, పప్పు దినుసులు దక్కడం లేదు. ధరలు పెరుగుతున్నా అవి రైతులకు దక్కడం లేదు. బియ్యం,పప్పుల ధరలు పెరుగుతున్నా పండిన పంటను ప్రజలకు చేరువ చేయడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. ఎలాంటి ఆందోళనలు లేకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించడం లేదు. సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు ఉన్నా లాభం లేదన్న పరిస్థితి ఏర్పడింది. సిసిఐ, మార్క్‌ఫెడ్ లాంటి సంస్థలు ఉన్నా న్యాయం జరగడం లేదు. ఇలా ఎంతకాలం రైతులు పంటలు అమ్ముకోవడానికి రైతులు ఆందోళనలకు దిగాలో పాలకులు చెప్పాలి. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. మార్కెట్‌లో సామా న్యులకు పప్పుల ధరలు అందనంతగా పెరిగాయి. దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి స్పష్ట మైన విధానాలు లేవు. మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలా కొనుగోలు చేసి... వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలు లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానం, ఆహార పంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తు కుంటున్నారు. కందులు, పెసర్లు,శనగలు, వేరుశనగను పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. మార్క్‌ఫెడ్ ఉన్నా సకాలంలో రంగంలోకి దిగడంలేదు. ఇప్పటికీ రైతులు తము పండించిన పంటలను అమ్మకోవడానికి నానాయాతనలు పడుతూనే ఉన్నారు. ప్రతి సీజన్‌లో ఇవే దృశ్యాలు కనిపిస్తూ నే ఉన్నాయి. ఓవైపు పప్పుల ధరలు అమాంతంగా పెరుగుతున్నా.. రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు రావడం లేదు. సాగుచట్టాలను బలవంతగా రుద్దిన కేంద్రం ..పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానాలను నేటికీ రూపొందించ లేదు. బడ్జెట్‌లో కూడా ఇలాంటి ప్రతిపాదనలు కనిపించడం లేదు. బ్యాంకులను ముంచి నోళ్లను.. కంపెనీ లు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోద యోగ్య విధానాలను మాత్రం రూపొందించలేక పోతున్నది. తెలుగు రాష్ట్రాల్లో కందులు, మిర్చి ,పత్తి, శనగ, వరి తదితర పంటలు విపరీతంగగా పండుతాయి. వీటిని సక్రమంగా మార్కెటింగ్ చేయించి ప్రజలకు తక్కువ ధరల్లో నిత్యావసరాలు అందించాలన్న ప్రణాళిక లేదు. పంటలు పండిన దశలో వారివద్దనుంచి పంటలను కొనుగోళ్లు చేసేలా శాశ్వత చర్యలు తీసుకోవాలి. వారిని ఆదుకునేందుకు ఎంత సాయం చేసినా దేశ అభివృద్ధికి పునాదిగానే భావించాలి. గతానుభవాలు దృష్టిలో పెట్టుకుని అయినా ప్రభుత్వాలు పటిష్ట మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం లేదు. గతేడాది వివిధ ప్రాంతాల్లో చేసిన ఆందోళనలు ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. ఏటా పసుపు,పత్తి, మిర్చి, ఎర్రజొన్న, కంది రైతులు ఆందోళనలు సర్వసాధారణమై పోయాయి. వీటిని గర్తించి ప్రభుత్వాలు జాగ్రత్త పడాలి. దేశంలో కనుక రైతులు అలిగి... ఈ దండగమారి వ్యవసాయం మన కెందుకులే అని అనుకుంటే ఏమవుతుందో పాలకులు ఆలోచించాలి. నష్టాలతో సేద్యం చేయడమెందుకని కాడి పడేస్తే ఏమవుతుందో అని ఆలోచన చేయాలి. అలా అన్నదాత ఆలోచిస్తే నోట్లోకి ముద్ద దిగదని గుర్తుంచుకోవాలి. అందరిలాగే తానూ ఏదో పట్నం వెళ్లి పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటానని నిర్ణయించు కుంటే..ప్రజల గతేం కానుందో ఊహించుకోవాలి.. వ్యవసాయం పడావు పడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తిగా అవగాహన లేక పోవడం కూడా మనకు ప్రమాదమే...అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశం గా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం.. పెట్టుబడి కోసం బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వడం..ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీలు లేకుండా కొనుగోలు చేయడం అవసరం. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారు పంటలను పండిస్తారు.అందుకు అవసరమైన వాతావరణం కల్పించాలి. రైతులు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగాలి. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేయాలి. రైతులు నిశ్చింతంగా వ్యవసాయం చేయొచ్చు అన్న భరోసా కలిగించాలి. ప్రత్యేకంగా పంటల కొనుగోళ్ల సమయంలో రైతులకు దిగులు లేకుండా చేయగలగాలి. తెచ్చి పంటలను చక్కగా అమ్ముకోగలిగేలా మార్కెట్ విధానాలు అవలం బించాలి. అప్పుడే సంపూర్ణ ప్రోత్సాహం దక్కగలదు. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ముకోలేక పోతున్నారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కు కోవాలన్నా, ప్రజలకు సక్రమంగా నిత్యావసరాలు అందాలన్న పటిష్టమైన మార్కెటింగ్ వ్యవస్థ కూడా ముఖ్యమే. అప్పుడే దేశం కూడా ఆర్థికంగా బలపడుతుంది. ప్రజలకు తక్కువ ధరలో ఆహారధాన్యాలు అందుతాయి. ఎగుమతుల ద్వారా విదేశీమారకం సంపాదించుకోగలుగుతాం. పాలకులు ఇలాంటి ఆలోచనతో ముందుకు సాగాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# నేరాల గుర్తింపులో సీసీకెమెరాల తోడ్పాటు



కాలనీల్లో సిసి కెమెరాలకు పోలీసుల ప్రోత్సాహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. ప్రమాదాలు జరిగినా, దొంగతనాలు, దాడుల వంటి సమయాల్లో సిసి ఫుటేజి కీలకంగా మారుతోంది. కేసుల అధ్యయనంతో పాటు, ఛేదించడంలోనూ మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు, రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. ప్రధానంగా పట్టణాల్లో, కాలనీల్లో ఏర్పటుకు స్థానికులను ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని డీజీపీ మహేందర్ రెడ్డి కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించగలిగినామని మహేందర్ రెడ్డి తెలిపారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిది గంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్‌కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొందేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది. కేసులను ఛేదించడంలో ఇవి ఎంతగానో తోడ్పడ్డాయి. అలాగే గతంలో అనేకానేక కేసులను సిసి కెమెరాల ద్వారా పరిష్కరించారు. కాలీనలు, అపార్ట్‌మెంట్లలో ఉంటున్నప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక పోలీసులు చైతన్యం కల్పిస్తున్నారు.

# సాగర్‌కు కొనసాగుతున్న వరద..12 గుట్లు ఎత్తివేత

**నల్లగొండ, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు 12 గేట్లు 10 అడుగులమేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు 2,3,099 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లే విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటమట్టం 590 అడుగు. ప్రస్తుతం 589 అడుగుల వద్ద ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటినిల్వ 312 టీఎంసీలు. ఇప్పుడు 309 టీఎంసీల వద్ద నీరు నిల్వ ఉన్నది. కుడి కాలువకు 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1795 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా 30,044 క్యూసెక్కుల నీరు బయటకు వెళు _న్నది.




## సచివాలయాలనికి కెసిఆర్ త్వరలో ప్రారంభం

మూడు మెగా ప్రాజుక్టులు సిద్దం అంటూ కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోన్న నూతన సచివాలయ ప్రారంభోత్సవానికి సంబంధించి ట్విటర్ వేదికగా మంత్రి కేటీఆర్ తాజా సమాచారం ఇచ్చారు. దీంతోపాటే మరో రెండు మెగా ప్రాజెక్టుల గురించీ ప్రస్తావించారు. హైదరాబాద్ నడిబొడ్డున నిర్మితమవుతోన్న రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభానికి సిద్ధమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్ సచివాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ అమరవీరుల స్మారకం ఏర్పాటు చేస్తామన్న కేటీఆర్.. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా వెల్లడించారు. రాష్ట్ర నూతన సచివాలయం సిద్ధమవుతోంది. త్వరలోనే తెలంగాణ అమరవీరుల స్మారకం ఏర్పాటు చేస్తాం. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేస్తాం. ఈ మూడు మెగా ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభిస్తారని మంత్రి కేటీఆర్ తెలిపారు.

## సామాన్యుడి ఇంటికి 13 లక్షల కరెంట్ బిల్లు



**చెన్నై, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** పుదుచ్చేరిలో ఓ సామాన్యుడికి విద్యుత్ శాఖ జులై మాసానికి ఏకంగా దాదాపు రూ.13 లక్షల కరెంట్ బిల్ పంపడంతో బిల్లు చూడగానే అతడి గుండె గుభేల్‌మంది. పుదుచ్చేరిలోని విశ్వనాథన్ నగర్‌లో టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ రాత్రిళ్లు వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తించి పొట్టపోసుకునే శరవణన్‌కు ఇంత పెద్దమొత్తంలో కరెంటు బిల్లు రావడంతో అతడు షాక్ తిన్నాడు. ఆపై సాంకేతిక పొరపాటుగా గుర్తించిన అధికారులు తప్పిదాన్ని సవరించడంతో శరవణన్ ఊపిరి పీల్చుకున్నాడు. గతంలో అతడి విద్యుత్ మీటర్ రీడింగ్ 20,630 కాగా జులై మాసంలో ఇచ్చిన బిల్లులో 2,11,150 యూనిట్లను చూపి అతడు 1,90,520 యూనిట్లు వాడినట్టు బిల్లులో చూపారు. అ÷-దదె ఇంట్లో ఉండే శరవణన్ ప్రతినెలా రూ 600-700 మధ్య కరెంట్ బిల్లు కడుతుండేవాడు. అసలు రీడింగ్ మెషీన్‌లో 5 అంకెలే చూపాలని 6 అంకెలు ఎలా నమోదైందో తెలియలేదంటూ బిల్లులో పొరపాటును చక్కదిద్దేందుకు శరవణన్ కరెంట్ ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. మొత్తం మీద సాంకేతిక పొరపాటును గుర్తించిన అధికారులు దాన్ని సవరించారు. మీటర్‌లో పొరపాటున రీడింగ్ చివరిలో అదనంగా సున్నా కలిసిందని, దీన్ని గుర్తించి పొరపాటును చక్కదిద్దామని అధికారులు చెప్పారు

# గిరిజన రిజర్వేషన్లు సాహసోపేత నిర్ణయం

తెలంగాణలో అన్ని వర్గాలకు అండగా కెసిఆర్ : ఎమ్మెల్యే రేఖానాయక్



**నిర్మల్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం వినూత్న పథకాలతో ముఖ్య మంత్రి కేసిఆర్ అందరి ఆదరాభిమానాలను చూరగొంటున్నారని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఇటీవల గిరిజన రిజర్వేషన్లు ప్రకటించడం విప్లవాత్మక నిర్ణయమని అన్నారు. గిరిజనులకు భరోసా కల్పించిన నేతగా కెసిఆర్ ఎప్పుడూ ముందుంటారని అన్నారు. అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం బంగారు తెలంగాణకు బాటలు వేస్తోందని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం పెండంతో పాటు రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రమాదాలకు తావు లేని రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని, సాహసోపేత నిర్ణయాలతో కేజీఆర్ తెలంగాణ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు రైతులకు ఎంతో బాసటగా ఉంటున్నాయన్నారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్‌లతో పేద కుటుంబాల్లోని ఆడ పిల్లలకు ఎంతో అండగా ఉంటున్నాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు చోటివ్వకుండా తెలంగాణ ప్రజలందరికీ ప్రయోజ నాలు చేకూర్చాలన్నదే కెసిఆర్ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హారితహార కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లాలో జోరుగా సాగిందన్నారు. గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 2018లో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందిం చింది. ఇందులో హారితహార కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక నర్సరీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఇవన్నీకూడా ముందు తరాలకు ఆదర్శం కానున్నాయని అన్నారు.

## గిరిజన రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో కృషి

కెసిఆర్ పథకాలు దేశానికి ఆదర్శం: శంకర్ నాయక్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి పథకాలన్ని సీఎం కేసీఆర్ అమలు చేసి అందించడం ఎంతో సాహసోపేతమైన నిర్ణయం అని ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. ముఖ్యంగా గిరిజన రిజర్వేషన్ల నిర్ణయం విప్లవాత్మకమని అన్నారు. ఇందుకు గిరజనులంతా కెసిఆర్‌కు రుణపడి ఉంటారని అన్నారు. ఈ విషయంలో బిజెపి తీరు దుర్మార్గంగా ఉందన్నారు. రైతుబంధు పథకమే కాకుండా తెలంగాణలోని ప్రతీ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా ఉంటున్నాయని అన్నారు. ఇలాంటి పథకాలు పెట్టి రాజకీయాలకు అతీతంగా వాటిని అమలు చేయండం అభినందనీయమని అన్నారు. కెసిఆర్ పథకాలతో తెలంగాణలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. అలాంటి సిఎం కోసం దేశమంతా ఎదురు చూస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు అందిస్తున్న రైతుబంధు పథకాన్ని సాగుకు పెట్టుబడి అందించే పెద్దన్న సీఎం కేసీఆర్ అని అన్నారు. ఇకపోతే పెట్టుపడి సాయాన్ని రైతులు సాగు కోసమే వినియోగించి,అధిక దిగుబడులు సాధించి సీఎం కేసీఆర్ సంకల్పాన్ని నెరవేర్చాలని సూచించారు. పెట్టుబడి సాయాన్ని రైతులు ఇతర ప్రయోజనాలకు వాడుకోకుండా వ్యవసాయానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

### బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన దానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చీరల పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బీఎస్ మక్తా, వెంకటేశ్వర కాలనీ, గౌరీ శంకర్ నగర్, ఫిలిం నగర్ బస్తీల్లో దానం ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగ విశిష్ఠతను ప్రపంచానికి చాటిన ఘనత తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకే దక్కుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా టీఆర్ఎస్ సర్కారు వితంతువులు, వికలాంగులకు ఆసరా పింఛన్లు అందిస్తోందని దానం చెప్పారు. పేదింటి ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి పథకం కింద లక్షా116 రూపాయల ఆర్థికసాయం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని దానం నాగేందర్ ప్రశంసించారు.

# ముంబై పోర్టులో భారీగా హెరాయిన్ పట్టివేత

**ముంబై, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** ముంబైలోని నవశేవ పోర్ట్‌లో పెద్ద ఎత్తున హెరాయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 22 టన్నుల కంటైనర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుకున్న హెరాయిన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.1,725 కోట్లు. ఢిల్లీ పోలీసూాఓ్ స్పెషల్ ఈ వివరాలు వెల్లడించింది. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉన్నది.

## గణేశ్ ఉత్సవాల్లో రోడ్డు ధ్వంసం

ఉత్సవ సమితికి భారీ జరిమానా విధింపు



**ముంబై, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** ముంబైలోని ప్రముఖ లాల్‌బగ్చా రాజా సార్వజనిక్ గణేశ్ ఉత్సవ మండలికి బృహన్ ముంబై నగర పాలక సంస్థ భారీ జరిమాన విధించింది. గణేశ్ నవరాత్రుల సందర్భంగా రోడ్డును ధ్వంసం చేశారని, దానికిగాను రూ.3.66 లక్షలు చెల్లించాలని నిర్వాహకులకు జరిమానా విధించింది. ఉత్సవాల సందర్భంగా ముంబైలోని డాక్టర్ బాబాసాహెచ్ రోడ్డు, టీబీ కదమ్ మార్గ్‌లో రోడ్డు ధ్వంసమయిందని పేర్కొన్నది. ఈ మార్గంలో మొత్తం 183 గుంతలు ఏర్పడ్డాయని బీఎంసీ తెలిపింది. ఒక్కో పాట్‌హోల్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలని స్పష్టం చేసింది. ముంబైలో గణేశ్ ఉత్సవాలు అనగానే లాల్‌బగ్చా రాజా వినాయకుడు గుర్తొస్తాడు. నిర్వాహకులు ఏటా భారీ గణనాథుడిని ప్రతిష్టించడం తోపాటు ఉత్సవాలను ఘనంగా చేస్తారు. లాల్‌బగ్చా గణెశుడిని దర్శించుకోవడానికి బాలీవుడ్ నటులు, రాజకీయ నాయులు పోటీపడుతుంటారు.

## మంత్రి ఎర్రబెల్లికి నిరసనసెగ

రోడ్డు కోసం మంత్రి ఎదుట ఆందోళన

**హన్మకొండ, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు నిరసన సెగ తగిలింది. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో పర్యటించిన మంత్రిని గ్రామస్థులు అడ్డుకున్నారు. తిమ్మాపూర్ రోడ్డు అధ్వానంగా మారిందని.. అధికారులకు ఎవరికి చెప్పినా పట్టించు కోవడం లేదంటూ మంత్రి ఎదుట ఆందోళన చెపట్టారు. త్వరగా రోడ్డు బాగుచేయాలని మంత్రికి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. కాసేపు గ్రామస్థులతో ముచ్చటించిన మంత్రి దయాకర్ రావు.. గ్రామంలో కావాల్సిన అవసరాలేంటో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి.. అందరూ యూనిట్ గా ఉంటారా అంటూ గ్రామస్థులను ప్రశ్నించిన మంత్రి ... కమ్మ వాళ్ళు మాట ఇస్తే తప్పరని అన్నారు. అటు రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ బాబు, అధికారులున్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి కెసిఆర్ ఆదర్శం

కెసిఆర్ జాతీయ రాజకీయ ప్రవేశం అనివార్యం

అన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణపథకాలు కోరుతున్నారు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడి



**వరంగల్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రామల అమల్లో సిఎం కెసిఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కేంద్రం తెలంగాన అభివృద్ధికి ఒక్క పైసా సాయం చేయడంలేదన్నారు. బిజెపికినూకలుచెల్లాలయని, కెసిఆర్ జాతీయ రాజకీయ ప్రవేశంతో బిజెపి పునాదులు కదలడం ఖాయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు సిఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు రైతు పంట పెట్టుబడి కోసం ఎవరివైపు చూడకుండా ఉండేందుకు ఎకరానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఇంత వరకు రైతుకు పంట పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వంగానీ, నాయకులు గానీ లేరన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన ఈ పంట పెట్టుబడి పథకంవైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. భూమి ఉన్న ప్రతి ఒక్క రైతుకు రైతుబంధు పథకం కింద పంట పెట్టుబడి అందుతుంది. రైతులకు పంట పెట్టుబడి ఇచ్చే ఈ రైతుబంధు పథకం ఇక నిరంతరాయంగా కొనసాగు తుందని తెలిపారు. వ్యవసాయం అంటే గిట్టుబాటుకానిదిగా, దండగగా ఉండేనని, వ్యవసాయానికి కనీసం రెండు గంటలు కూడా కరెంటు రాని పరిస్థితిని మార్చి ఇప్పుడు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారని, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారని, కోటి ఎకరాలను మాగాణాగా మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారని అన్నారు. రైతులకే కాకుండా పేదింట్లో ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావద్దని మొదట్లో 51వేల రూపాయలు ఇచ్చారని, అది సరిపోదని దానిని 75వేల రూపాయలకు పెంచారని, అదీ చాలడం లేదని ఇప్పుడు లక్షా 116 రూపాయలను ఇస్తున్నారన్నారు. పేదింట్లో ఆడపిల్ల గర్భం దాల్చితే ప్రసవం అయ్యే వరకు పని చేయాల్సి వస్తుందని గుర్తించిన సిఎం కేసిఆర్ ఇక అలాంటి పరిస్థితి ఉండొద్దని ప్రసవానికి మూడు నెలల ముందు, ప్రసవం తర్వాత మూడు నెలల వరకు నెలకు 2000 రూపాయల చొప్పున ఆరు నెలల పాటు 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే అదనంగా 1000 రూపాయలు కలిపి 13వేల రూపాయలు అందిస్తున్నారని చెప్పారు. అంతే కాకుండా తల్లిబిడ్డలను అమ్మఒడి వాహనంలో ఇంటి దగ్గర దించుతున్న ప్రభుత్వం దేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక్కటేనని అన్నారు. ఇంతటి మంచి పథకాలు అమలు చేస్తున్న సిఎం కేసిఆర్‌ను దేశప్రజలుకూడా ఆదరిస్తారని అన్నారు. తమరాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

# మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి




**మహిళలను విస్మరించే సమాజాన్ని ఊహించలేం**
**మహిళాభివృద్ధితోపాటు భద్రతకు అధిక ప్రాధాన్యం**
**మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** మహిళా సాధికారత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి మార్గంలో దూసుకుపోతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి చెప్పారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను విస్మరించి అభివృద్ధి సాధించడం సాధ్యం కాదని అన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధితోపాటు వారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని అన్నారు. భూమిక ఉమెన్స్ కలెక్టివ్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగ సమానత్వం ద్వారా మహిళా సాధికారత అనే అంశంపై సికింద్రాబాద్ మినర్వా గ్రాండ్ హోటల్లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆడపిల్ల చదువు ఇంటికి సమాజానికి వెలుగు అని అన్నారు. సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ లేని విధంగా మహిళల ఆరోగ్యం, సంక్షేమం పట్ల అనేక పథకాలు చేపట్టిందని స్పష్టం చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలలో నాణ్యమైన భోజన వసతి, విద్య కల్పించారని తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ నిధి ద్వారా విదేశీ చదువులకు 20 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తోందని గుర్తు చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక మనోబలం కల్పించారని, ఆరోగ్య లక్ష్మి, కేసీఆర్ కిట్స్ ద్వారా మాతా శిశువులకు ఆరోగ్య, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారని సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని, మహిళల ఆలోచనలకు అనుగుణంగా అన్ని విధాలుగా సహాయం అందిస్తున్నారని చైర్ పర్సన్ తెలిపారు. దేశంలోనే ప్రథమంగా స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరీక్షించడమే కాకుండా వారికి రక్షణగా మహిళా కమిషన్ నిలుస్తుందన్నారు. ఆడ,మగ అంటూ బేధాభిప్రాయంతో పిల్లలను పెంచకూడదని సమన హక్కు కల్పిస్తూ పెంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరి మీద ఉందన్నారు. కమిషన్ మహిళలకు రక్షణ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు అండగా నిలుస్తుందన్నారు. అదే విధంగా చదువులో కానీ ఏ రంగంలో కానీ లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మించుకోవాలని కోరారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడానికి తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ అవరణలోనే 'షీ క్యాబ్స్' పథకం ద్వారా ఎంత మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. మహిళల హెల్ప్ లైన్ 198 లేదా పోస్టల్, ట్విట్టర్, ఇ మెయిల్ తదితర మార్గాల ద్వారా లేదా కమిషన్ నెంబర్ 9490555533 కు మహిళలు సమస్యలను తెలుపవచ్చునని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివ్య దేవరాజన్, మహిళా కమిషన్ సెక్రెటరీ కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిదేళ్లుగా ప్రజలను మోసగిస్తున్న కెసిఆర్

**పాదయాత్రలో వైఎస్ షర్మిల విమర్శలు**



**వికారాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** ఏనిమిదేళ్లుగా సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. వికారాబాద్ జిల్లా తొండపల్లి నుంచి చిట్యాల, రాఘవాపూర్ మీదుగా షర్మిల పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా కేసీఆర్‌ను ఉద్దేశించి షర్మిల విమర్శలు చేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పరిగికి నీళ్లిస్తామని కేసీఆర్ మోసం చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ కు ప్రజలంటే కేవలం ఓటు బ్యాంకేనని ..ఎన్నికలుంటేనే బయటకు వస్తాడని విమర్శించారు. ఎన్నికల్లో ఓటు వేయించుకుని మళ్లీ ఫామ్ హౌజ్ కు వెళ్ళిపోతాడని అన్నారు. ఈ సారి కేసీఆర్ ను నమ్మొద్దని షర్మిల అన్నారు. కేసీఆర్ ప్రతి పథకం అబద్ధమేనని.. ఒక్క హామిని కూడా నెరవేర్చలేదన్నారు.

# పాదయాత్రలో బండి అబద్దాల మోత



**తెలంగాణకు కేంద్ర సహకారం ఏమిటో చెప్పాలి**
**ఎంపి మాటలు రోత పుట్టిస్తున్నాయి: బడుగుల**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** పాదయాత్రలో సంజయ్ అన్నీ అబద్దాలే మాట్లాడుతున్నారని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం అందించకుండా, మతతత్వాన్ని రెచ్చగొట్టే విధంగా బండి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం అందరికీ ఒకేలా ఉంటుందన్నారు. పాత నగరానికి వేరేలా, ఇతర ప్రాంతాలకు మరోలా ఉండదన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ తీరు వెగటు పుట్టించేలా ఉందని లింగయ్య యాదవ్ మండిపడ్డారు. సంజయ్ తన పాదయాత్రలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఎంపీగా ఉండి ఇంత నీచంగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. టీఆర్ఎస్ ఎల్పీలో వికారాబాద్ ఎమ్మెల్యే మెతకు ఆనంద్‌తో కలిసి బడుగుల లింగయ్య యాదవ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నాయని లింగయ్య యాదవ్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఏ పథకాలు అమలు కావడం లేదని సంజయ్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. దళితులను ఆదుకునేందుకే దళితబంధు అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. దమ్ముంటే దేశంలోని దళితులందరికీ ఈ పథకాన్ని అమలు చేసేలా మోదీని ఒప్పించాలని సంజయ్‌కు సవాల్ చేశారు. బీజేపీది దొంగల ప్రభుత్వం అని విమర్శించారు. దేశంలో కేసీఆర్ నాయకత్వం రావాలని పలు రాష్ట్రాలు కోరుకుంటున్నాయని లింగయ్య యాదవ్ స్పష్టం చేశారు.

# నాయకత్వ లోపమే కాంగ్రెస్‌కు అసలు సమస్య




(మొదటి పేజీ తరువాయి..) పక్షాన జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ ఎవరిని ఉద్ధరిస్తారంటూ ఆయన ఎద్దేవా చేశారు. సూర్యాపేటలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మంత్రి జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి నాయకత్వ లోపమే పెద్ద శాపంగా మారిందని వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో నాయకత్వ లేమి కాంగ్రెస్ పార్టీని ఎక్కిరిస్తుందంటూ ఆయన ఎద్దేవా చేశారు. మునుగోడు ఉప ఎన్నికలలో రెండో స్థానం కోసమే కాంగ్రెస్, బీజేపీ పోటీ పడుతున్నాయన్నారు. అక్కడ గెలిచేది టీఆర్ఎస్ పార్టీయేనని, ఎగిరేది గులాబీ జెండాయేనని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలలో దేశానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే శరణ్యమన్నారు. యావత్ భారత దేశం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తుందని, రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణ అభివృద్ధి దేశం మొత్తానికి విస్తరించాలి అన్నదే దేశ ప్రజల ఆకాంక్ష అని ఆయన చెప్పారు. అంతకుముందు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల జీవితాలకు వెలుగులు ప్రసాదించే విద్యాభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటుచేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. బుధవారం పెన్ పహాడ్ మండల కేంద్రంలో రూ. 4 కోట్ల 50లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ పాఠశాల భవనాన్ని టీఎస్ఈడబ్ల్యుఐడీసీ రావుల శ్రీధర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడక ముందు నాలుగు వందల గురుకులాలు మాత్రమే ఉండేవని, రాష్ట్రం ఏర్పడిన తరువాత 1150 జూనియర్ కళాశాలలను రెసిడెన్షియల్ కళాశాలలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి వరకు ఉన్న కస్తూర్బా పాఠశాలలను 270 జూనియర్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఇటీవల పీజీ ఎంట్రన్స్ సగానికి పైగా సీట్లు ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థులు సాదించడం శుభ పరిణామం అన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాటిల్, జడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక, పెన్ పహాడ్ ఎంపీపీ నెమ్మాది బిక్షం, జడ్పీటీసీ మామిడి అనిత, మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్, సింగిల్ విండో చైర్మన్ వెన్న సీతా రామ్ రెడ్డి, నాతాల జానికి రామ్ రెడ్డి తదితులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం




(మొదటి పేజీ తరువాయి..)ఉద్దేశ్యంతో బతుకమ్మ పండుగకు చీరెలు పంచుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర సంస్కృతిని చాటిచెప్పే పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు.

# నేటినుంచి బతుకమ్మ చీరెల పంపిణీ



(మొదటి పేజీ తరువాయి..)బతుకమ్మ కానుకలను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలకు చేయూతనివ్వడంతోపాటు, ఆడబిడ్డలకు ప్రేమపూర్వక చిరుకానుక ఇవ్వాలన్న ఉధాత్తమైన ఉభయతారక లక్ష్యంతో కార్యక్రమాన్ని 2017లో ప్రారంభించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమానికి.. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ, తమ టెక్స్‌టైల్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. గ్రామాల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధుల అభిప్రాయాలు, ఆసక్తులు, నిఫ్ట్ డిజైనర్ల సహకారంతో సరైన డిజైన్లు, అత్యుత్తమ ప్రమాణాలతో ఈ ఏడాది బతుకమ్మ చీరెల నూతన డిజైన్లతో ఉత్పత్తి చేశామన్నారు. ఈ సంవత్సరం 24 విభిన్న డిజైన్లు, పది రకాల ఆకర్షణీయ రంగుల్లో మొత్తం 240 రకాల థ్రెడ్ బోర్డర్ (దారపు పోగుల అంచుల)తో తయారు చేయబడిన 100శాతం పాలిస్టర్ ఫిలిమెంట్ నూలు చీరలను టెక్స్‌టైల్ శాఖ తయారు చేసిందన్నారు. మహిళలకు 92లక్షల సాధారణ చీరెలు, వయోవృద్ధులకు తొమ్మిది మీటర్ల పొడువున్న చీరెలు 8లక్షలు తయారు చేయించామన్నారు. మొత్తంగా కోటిచీరెలను రాష్ట్రంలో ఆహార భద్రతా కార్డు కలిగిన ప్రతీ ఆడబిడ్డకు అందించనున్నట్లు చెప్పారు. నేతన్నలకు గౌరవ ప్రదమైన ఉపాధి కల్పిస్తున్న ఈ బతుకమ్మ చీరెల ప్రాజెక్టు కోసం రూ.339.73 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 5.81 కోట్ల చీరెరలను ఆడబిడ్డలకు ఐదు దఫాలుగా అందించినట్లు కేటీఆర్ వివరించారు. కార్యక్రమం ద్వారా సంక్షోభంలో చిక్కుకున్న నేతన్నలకు ఒక గొప్ప భరోసా వచ్చిందని, వారి వేతనాలు రెట్టింపు అయ్యాయన్నారు. తద్వారా వారు తమ కాళ్లపైన తాము నిలబడే పరిస్థితికి చేరుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఉపాధి లేక ఆగమైన నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. బతుకమ్మ చీరెల పంపిణీతో అటు ఆడబిడ్డలకు ఆనందంతో పాటు ఏడాది పొడవునా నేతన్నలకు ఉపాధి భరోసా దొరికిందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బతుకమ్మ చీరెల వంటి వినూత్నమైన కార్యక్రమాలతో నేత కార్మికుల ఒకవైపు ఆదుకునే ప్రయత్నం చేస్తుంటే, టెక్స్‌టైల్ ఉత్పత్తులపైన జీఎస్టీ వంటి నిర్ణయాలతో నేతన్నలను నిలువునా ముంచే నేత కార్మికుల వ్యతిరేక చర్యలను కేంద్రం తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. కేంద్రం నేతన్నలను, వారి పరిశ్రమను, వారి జీవితాలను పట్టించుకోకున్నా, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నేతన్నలకు కోసం తాము నిరంతరం నిబద్ధతతో పనిచేస్తామని కేటీఆర్ అన్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం సైతం సూమారు కోటి బతుకమ్మ చీరలను పంపీణి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది గతంలో కన్నా మరిన్ని ఎక్కువ డిజైన్లు, రంగుల, వెరైటీల్లో ఈ చీరలను తెలంగాణ టెక్స్‌టైల్ శాఖ తయారు చేసిందని వివరించారు.

# దసరా సెలవుల్లో మార్పు లేదు



(మొదటి పేజీ తరువాయి..) దసరాకు 14 రోజులకు బదులుగా తొమ్మిది రోజులే సెలవులు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖకు ఎస్సీఈఆర్టీ ప్రతిపాదించినట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా జూలైలో వర్షాల కారణంగా సెప్టెంబర్ 17న పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో ఏడు రోజులు పనిదినాలు తగ్గాయని, ఈ సెలవు దినాలను భర్తీ చేసేందుకు దసరా సెలవులను కుదించాలని ఎస్‌సీఈఆర్‌టీ పాఠశాల విద్యాశాఖకు ప్రతపాదనలు చేసినట్లు, నవంబరు నుంచి ఏప్రిల్ వరకు రెండో శనివారాలు కూడా పాఠశాలలు పనిచేయాలని ప్రతిపాదించినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ తోసిపుచ్చింది. ముందుగా ప్రకటించిన మేరకు దసరా సెలవులు ఇవ్వనున్నట్లు బుధవారంనాడు ప్రకటించింది. దసరా సెలవుల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు చేయలేదంటూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. గతంలో ప్రకటించిన విధంగానే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 9 వరకు సెలవులు ఉంటాయని స్పష్టంచేసింది.

## కుటుంబ పాలన విముక్తం చేయాలి: బిజెపి

**జగిత్యాల, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** రాష్ట్రంలో సాగుతున్న నిరంకుశ పరి పాలకు చరమగీతం పాడుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ రావు అన్నారు. కటుఉంబ పాలన అంతమొందిస్తే తప్ప తెలంగాణకు విముక్తి లేదన్నారు. నిజమైన విముక్తి కెసిఆర్‌ను తొలగించినప్పుడే అని అన్నారు. జిల్లాలో భరోసా యాత్రలకు ప్రజల నుంచిమంచి స్పందన వస్తోందని అన్నారు. అన్ని గ్రా మాలలో పల్లె గోస బీజేపీ భరోసా సాగుతోందిన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రం లో జరుగుతున్న కుటుంబ పాలనపై ప్రజలకు వివరించాలని అన్నారు.

## శ్రీవారి భక్తులకు రైల్వేశాఖ శుభవార్త

**తిరుపతికి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** శ్రీవారి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తిరుమలకు వెళ్లాలనుకుంటున్న భక్తులకు రైల్వే శాఖ శుభవార్తను అందించింది. బుధవారం నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. సికింద్రాబాద్-తిరుపతి రైలుతోపాటు నాందేడ్-తిరుపతి రైళ్లు నడిపేందుకు నిర్ణయించింది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 26న అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. రెండేండ్ల అనంతరం భక్తుల సమక్షంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు టీటీడీ నిర్ణయించడంతో భక్తుల రద్దీ పెరుగనున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రైల్వేశాఖ కూడా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. భక్తుల రద్దీని బట్టి మరిన్ని ప్రత్యేక రైళ్లే నడిపేందుకు సిద్ధమని అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు (నంబర్ 07469/07470) ఈ నెల 22న సాయంత్రం 5.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.20 కి తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 23న రాత్రి 8.15 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. కాగా, నాందేడ్-తిరుపతి మధ్య కూడా మరో ప్రత్యేక రైలు నడపనున్నారు. నంబర్ 07633 రైలును ఈ నెల 24న 12.00 గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు 08.30 గంటలకు గమ్యానికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి-నాందేడ్ (నంబర్ 07634) ప్రత్యేక రైలు ఈ నెల 25న నడపనున్నారు. ఈ ట్రైయిన్ రాత్రి 21.10 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు 17.20 గంటలకు గమ్యానికి చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వేశాఖ విజ్ఞప్తి చేసింది.

# ఇంజెక్షన్ హత్యకేసులో పురోగతి


(మొదటి పేజీ తరువాయి..) అదుపులోకి తీసుకున్నారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంలో రెండునెలల ముందే జమాల్ హత్యకు కుట్రపన్నారని తెలిపారు. భర్తను చంపేందుకు భార్య ఇమామ్‌బీ ఇంట్లోనే ఇంజక్షన్ దాచిపెట్టిందని పోలీసులు చెప్పారు. చింతకాని మండలం బొప్పారం గ్రామానికి చెందిన జమాల్ సాహెబ్ ఈ నెల 19న ముదిగొండ మండలం వల్లభి సమీపంలో ఇంజక్షన్ దాడిలో మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న జమాల్‌ను వల్లభి దవాఖాన సమీపంలో ఓ వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. దీంతో అతడిని బైక్‌పై ఎక్కించుకున్నారు. వెనక కూర్చున్న వ్యక్తి ఇంజెక్షన్ ఇవ్వడంతో జమాల్ మృతిచెందారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వివాహేతర సంబంధమే దీనికి కారణమని నిర్ధారించారు. వివాహేతర బంధం.. పచ్చని కుటుంబాలను ఎలా నాశనం చేస్తుందో.. ఈ ఘటన అద్దం పడుతోంది. ఖమ్మం జిల్లాలో తాజాగా వెలుగుచూసిన హత్య ఘటన సంచలనం కలిగించింది. తన వివాహేతర బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని.. భార్యే ఏకంగా విష ప్రయోగం చేసి, హత్య చేయించిన ఘటన విస్మయం కలిగిస్తోంది. ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించిన ఖమ్మం సీపీ విష్ణు వారియర్.. కేసును ఛేదించేందుకు 4 ప్రత్యేక బృందాలను నియమించారు. ఘటన జరిగిన తీరు, నిందితుల ఆచూకీ కోసం ముమ్మర విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే ముందు నుంచి జమాల్ సాహెబ్ కుటుంబసభ్యులపై అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు.. ఫోన్ కాల్ డేటా సేకరించి ,జమాల్ భార్య ఫోన్‌కాల్ జాబితాలో హత్యకు పాల్పడ్డ నిందితుల ఫోన్ నెంబర్లు ఉండటం, వారితోనే ఎక్కువ సార్లు మాట్లాడినట్లు ఆధారాలు లభించటంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. చింతకాని మండలం నామవారానికి చెందిన మోహన్‌రావు, ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్, ఆర్ఎంపీ వైద్యుడు వెంకట్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇమామ్‌బీ తన ప్రియుడితో కలిసి భర్త జమాల్ హత్యకు రెండు నెలల క్రితమే పథకం రచించింది. ఇందులో భాగంగా ఆర్ఎంపీ వెంకట్ సహకారంతో విష ప్రయోగం చేసేందుకు ఇంజక్షన్ సైతం ఇంట్లోనే దాచిపెట్టింది. ఇంట్లో విష ప్రయోగానికి ధైర్యం చాలకపోవటంతో.. ఆ పనిని తన ప్రియుడికే అప్పజెప్పింది. ఇందులో భాగంగానే.. మోహన్‌రావు, వెంకటేశ్, వెంకట్‌లు జమాల్ హత్యకు ప్రణాళిక రూపొందించారు. బిడ్డ ఇంటికి వెళ్లి వస్తున్న జమాల్‌ను వీరందరూ దారికాచారు. ఈ క్రమంలోనే ఆర్ఎంపీ వెంకట్ జమాల్ బైక్ ఎక్కి.. ఇంజక్షన్ ఇచ్చి, వెళ్లిపోయాడు. ఇంజక్షన్ దాడిలో మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ ప్రారంభించారు. వల్లభిలోని ఘటనా ప్రాంతాన్ని ఏసీపీ బస్వారెడ్డి, సీఐ శ్రీనివాసరావు పరిశీలించారు. జమాల్ సాహెబ్‌కు మంచినీళ్లు ఇవ్వడంతో పాటు వల్లభి ఆస్పత్రికి తరలించిన ఇద్దరు యువకులను ప్రశ్నించారు. అయిప్పటికీ కేసులో పురోగతి లేకపోవడంతో పోలీసుల దృష్టి జమాల్ సాహెబ్ కుటుంబీకుల వైపు మళ్లింది. జమాల్ సాహెబ్ కుటుంబసభ్యుల కాల్ డేటాను సైతం పోలీసులు సేకరించారు. ఇక్కడే పోలీసులకు కీలక ఆధారాలు లభించాయి. పోలీసులకు లభించిన ఆధారాలతో మున్నేరు ఒడ్డున ఉన్న గ్రామానికి చేరుకుని ఓ వ్యక్తిని విచారించేందుకు వెళ్లగా.. అతడు పోలీసులను ఏమార్చి పరారయ్యాడు. హత్య కేసులో సూత్రధారులుగా ఉన్న మరో ఇద్దరికీ ఈ సమాచారం పొక్కడంతో వారూ పారిపోయారు. ఈ కేసులో ఇప్పటికే పూర్తి ఆధారాలు లభించినందున పోలీసులు మృతుడి భార్య సహా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్యకు ప్రధానంగా వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనే పూర్తిగా కేసు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

## కాలం నిరంతర ప్రవాహం ( ఆధ్యాత్మికం )

**తిరుమల, సెప్టెంబర్ 21 (సమ సమాజం):** కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఫలితాలన్ని మనకు అనుకూలంగా లేవన్న భావన కూడా సరికాదు. పశు పక్ష్యాదులు, ఎడారుల్లో సంచరించే జీవులు, ఉభయచరాలు ఎంతో ఓర్పు, సహనంతో కాలం వెళ్ళ బుచ్చుతాయి. మున్ముందు కాలం అనుకూలంగా ఉంటుందన్న ఆశతో ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకొని జీవిస్తాయి. జీవకోటిలో తెలివితేటలున్న మనిషి మాత్రం అనుకున్నదే తడవుగా ఫలితం వెంటనే కనబడాలని చూస్తాడు.ఒక పేదవాడు తన ఇంటిముందు ఓ మొక్క నాటాడు. కొన్ని రోజులకు అది పెరిగి పెద్దదయింది. అది పండ్లు ఇచ్చి ఆకలి తీర్చుతుందని ఆశపడ్డాడు. చాలా రోజులు ఎదురు చూశాడు. కాని, అలా జరగలేదు. తగినంత ఆహారం అందక శరీరంతోపాటు మనసూ బలహీనపడింది. ఫలితంగా, అతడి నిరీక్షణ- కాలాన్ని మరింత పొడిగించిన భావన కలగజేసింది. విసుగు తెప్పించింది. కోరిక నెరవేరలేదని అతడిలో కోపాగ్ని రగిలింది. విచక్షణా జ్ఞానం కోల్పోయాడు. పూత, కాత రెండూ లేని చెట్టు ఎందుకని దాన్ని నరికివేశాడు. మరుసటి రోజు తెల్లవారి లేచి చూస్తే పడిపోయిన చెట్టుకు ఒక పువ్వు పూసి ఉంది. ఆ సన్నివేశం చూశాక అతడిలో దుఃఖం పొంగుకొచ్చింది. ఆ చెట్టును పట్టుకుని విలపించాడు. తొందరపడ్డానని బాధపడ్డాడు. జీవితం ఇలాగే అనూహ్య తీర్పునిస్తుంది. కారణం, అది నిత్యనూతనం. అందువల్లే 'ఫలితం పని చేసేవాడి చేతిలో లేదు. అది కాలపురుషుడి నిర్ణయం' అని గీత చెబుతుంది.




# చలన చిత్రం



## కృష్ణంరాజు మరణంతో ప్రభాస్ సినిమాలకు గ్యాప్

### మారుతితో సినిమా వచ్చే ఏడాదికి పోస్ట్‌పోన్


ప్రభాస్ ఒక పక్క ముల్టీపుల్ సినిమాలతో బిజీ గా వున్నాడు. మరో పక్క కొత్త సినిమాలు ఒప్పుకుంటు న్నాడు. అందులో భాగంగానే మారుతితో ఒక సినిమా చెయ్యాలని,అదికూడా ఈ నవంబర్‌లో మొదలుపెట్టాలని అనుకున్నాడు. అయితే అతని పెదనాన్న కృష్ణంరాజు చనిపోవటంతో ప్రభాస్ మధ్యలో అన్ని సినిమాలకి బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. మొగల్తూరులో సంస్మరణ సభ అయిపోయాక ప్రభాస్ షూటింగ్స్‌లో పాల్గొంటాడు అని తెలిసింది. ఆదిపురుష్ పూర్తికి ముందు ప్రాముఖ్యం ఇవ్వాలని అనుకుంటున్నాడు. ఎందుకంటే ఆ సినిమానే ముందుగా విడుదల ఉంటుంది, అదీ కాకుండా ఆ సినిమా భారీ ఎత్తున విడుదల చెయ్యాలని ఆ సినిమా నిర్వాహకులు అనుకుంటున్నారు. ఆ సినిమా అయ్యేసరికి కొంచెం టైం పడుతుంది, ఆ తరువాత సాలార్ కూడా చెయ్యాలి. అందుకని అతను దర్శకుడు మారుతితో చేసే సినిమా వచ్చే సంవత్సరం ఫెబ్రవరి నుండి చెయ్యాలని అనుకుంటున్నాడని తెలిసింది. ఈ సినిమా కోసం, నిర్మాతలు పీపుల్స్ మీడియా వాళ్ళు ప్రభాస్ కి 50 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చారని కూడా తెలిసింది. సాలార్ అయ్యాక ప్రభాస్ ప్రాజెక్ట్ కె కూడా కంప్లీట్ చెయ్యాలి. ఇన్ని సినిమాలు ఒకేసారి చేస్తున్నా, విడుదల తేదీలు మాత్రం ఒకదానితో ఒకటి క్లాష్ కాకుండా చూసుకుంటున్నాడు.



## పుష్పతో పెరిగిన అల్లు అర్జున్ బ్రాండ్


### అనేక యాడ్ ఫిలిమ్స్‌తో భారీగా ఆదాయం

పుష్ప సినిమాతో అల్లు అర్జున్ పేరు ఇప్పుడు ప్రపంచం అంత మారుమోగుతోంది. దీనికితోడు అతని రేంజ్కూడా పెరిగింది. అతని చుట్టూ ఇప్పుడు కోట్ల వ్యాపారం నడుస్తోంది అంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు దేశంలో ఏ నటుడికీ లేనంత డిమాండ్ అల్లు అర్జున్‌కి ఏర్పడింది. పుష్ప సినిమాలో అతను ఎంత కష్ట పడ్డాడో చూస్తే తెలుస్తుంది. ఆ కష్టానికి తగ్గ ఫలితం ఇప్పుడు వస్తోంది. అల్లు అర్జున్ లేదా బన్నీఅని ముద్దుగా పిలుచుకునే అతని అభిమానులు, ఇప్పుడు చాల బ్రాండ్స్‌కు అంబాసడర్ గా వున్నాడు. అతను నచ్చిన వాటికే ఒకే చెప్తూ, ఆ యాడ్స్ షూట్ చేసే పనిలో వున్నాడు. ఇప్పుడు బన్నీ ఒక 5 యాడ్స్ ఒప్పుకున్నాడు అని తెలిసింది. వాటికీ అతను తీసుకునే రెమ్యూనరేషన్ ఎంతో తెలిస్తే ఆశ్చర్యపోతారు. అక్షరాలా 45 కోట్లు ఒక్కో యాడ్ కి 9 కోట్లు వంతున తీసుకుంటున్నాడు. ఇలా ఇంత డిమాండ్ వున్న నటుడు బహుశా ఎవరూ లేరేమో. హిందీ నటులకు మించి తలదన్నేలా, బన్నీ పేరు ఇప్పుడు వినపడుతోంది. అందుకే పుష్ప పార్ట్ 2కి తొందర పడకుండా, ఎక్కడా రాజీ పడకుండా తీయాలని అనుకుంటున్నాడు. దర్శకుడు సుకుమార్ తో బన్నీ ఇప్పుడు ఆ షూటింగ్ గురించే మాట్లాడుతున్నాడు అని అంటున్నారు. త్వరలో షూటింగ్ మొదలవుతుంది. ఈలోపు వూరికే కూర్చోకుండా, తన బ్రాండ్ ని విస్తృతపరచడానికి ఈ యాడ్స్ చేసుకుంటూ పోతున్నాడు.



## పట్టాల కెక్కుతున్న నాగచైతన్య తాజా చిత్రం

ఈ యేడు ఇప్పటికే బంగార్రాజు, థాంక్యూ, లాల్‌సింగ్ చద్దా సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన నాగచైతన్య.. తదుపరి సినిమాని కూడా ఆమధ్య అనౌన్స్ చేసేశాడు. ఇది తనకి ఇరవై రెండో సినిమా. వెంకట్ ప్రభు డైరెక్ట్ చేయబోతున్నాడు. ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్‌ని తన తాతయ్య అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా వెల్లడించాడు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తున్నారనేదే ఆ అప్‌డేట్. 'ఏఎన్నాఆర్ గారి దివ్య ఆశీస్సులతో మా ప్రాజెక్ట్ మొదలుపెడుతున్నాం.. యాక్షన్ బిగిన్స్' అన్నారు చిత్ర నిర్మాత శ్రీనివాస చిట్టూరి. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రంలో కృతీశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇతర నటీనటుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. ఇళయరాజా, యువన్ శంకర్ రాజా కలిసి సంగీతం అందించనుండడంతో ఆసక్తి నెలకొంది. అబ్బూరి రవి డైలాగ్స్ రాస్తున్నారు. రీసెంట్‌గా 'మానాడు'తో మంచి విజయాన్నే అందుకున్నాడు వెంకట్ ప్రభు. మరి చైతు కోసం ఎలాంటి కథ రాశాడో, అతనిని ఎలా చూపించబోతున్నాడో చూడాలి!




## థాంక్‌గాడ్ చిత్రంపై వివాదాలు

### హిందూ దేవుళ్లను అవమానించారన్న ఫిర్యాదులు

అజయ్ దేవ్‌గణ్, సిద్దార్థ్ మల్హోత్ర, రకుల్ ప్రీత్ సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న బాలీవుడ్ ఫిల్మ్ థ్యాంక్ గాడ్. ఇంద్రకుమార్ దర్శకత్వంలో వస్తోన్న ఈ మైథలాజికల్, పునర్జన్మ, స్వర్గం-నరకం అనే పాయింట్ మీద తెరకెక్కిన ఈ కామెడీ సినిమాకు దీపావళి పండగ సందర్భంగా అక్టోబర్ 25న విడుదల కానుంది. అయితే ఇప్పటికే ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్‌ను కూడగట్టుకోగా.. అదే స్థాయిలో వివాదాలనూ మూటగట్టుకుంటోంది. ఈ సినిమాలో హిందూ దేవుళ్లను కించపరిచారని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగ థ్యాంక్ గాడ్ సినిమాను నిషేధించాలని డిమాండ్ చేస్తూ మధ్యప్రదేశ్ విదర్యాశాఖ మంత్రి విశ్వాస్ సారంగ్, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ కు లేఖ రాశారు. హిందూ దేవుళ్లను అనుచితంగా ప్రదర్శించారని, హిందూ మతాన్ని అపహాస్యం చేసేలా ఈ సినిమా ఉందని ఆరోపించారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సినిమా చిత్రీకరణ జరుపుకుందన్నారు. ఇదిలా ఉండగా థ్యాంకూ గాడ్ సినిమాలో అజయ్ దేవ్‌గణ్ ఓ మోడర్న్ చిత్రగుప్తుడిగా నటించాడు. బూట్లు వేసుకొని, కూలింగ్ గ్లాసెస్, ఇయర్ రింగ్స్ తో స్టైలిష్‌గా కనిపించాడు. యమదూతలు సైతం అదే పంథాను సాగిస్తూ కనిపిస్తారు. దీంతో ఈ సినిమాని హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా తీశారని వాదనలు తలెత్తుతున్నాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in